క్లుప్తంగా

నియామకం

మంచిర్యాలటౌన్: స్టార్ మంచిర్యాల జిల్లా బ్యాడ్మింటన్ ప్రధాన కార్యదర్శిగా పుల్లూరి సుధాకర్ నియామకమయ్యారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి పుల్లెల గోపిచంద్ ఉత్తర్వులు జారీ చేయగా గురువారం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉపేందర్‌రావు అందించారు.

అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానం


డాక్టర్ రాజేశ్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని టచ్ ఆసుపత్రిలో గుండె వైద్య నిపుణుడిగా పనిచేస్తున్న డాక్టర్ రాజేశ్ వి బోర్కుండేకు అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానం అందింది. గుండె వైద్య నిపుణుల అంతర్జాతీయ వైద్య సదస్సును 2025లో దుబాయ్‌లో నిర్వహించనుండగా, ప్రతిష్టాత్మక సదస్సుకు డాక్టర్ రాజేశ్ హాజరుకానున్నారు. కార్డియాలజీలో తాను చేసిన రీసెర్చ్‌కి భారతదేశం నుంచి స్పీకర్‌గా తను ఎంపిక కావడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

ముందస్తు టీకాలు తప్పనిసరి


బెల్లంపల్లిరూరల్: టీకా వేస్తున్న సిబ్బంది

దండేపల్లి/కాసిపేట/బెల్లంపల్లిరూరల్: పశువులకు ముందస్తు టీకాలు వేయించడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా కాపాడవచ్చని పశువైద్యాధికారులు తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. బెల్లంపల్లి మండలం మాలగురిజాలలో, దండేపల్లి మండలం గూడెంలో, కాసిపేట మండల ధర్మారావుపేటలో పశువులకు గురువారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఆయా కార్యక్రమాల్లో బెల్లంపల్లిలో మండల పశువైద్యాధికారిణి పావని, దండేపల్లి మండల పశువైద్యాధికారి ధన్‌రాజ్, కాసిపేట మండల పశువైద్యాధికారిణి సరిత, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

‘ఆరోపణలు మానుకోవాలి’

బెల్లంపల్లి: భూ కబ్జా చేశానని తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, ఆ ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు బెల్లంపల్లి మున్సిపల్ మాజీ కౌన్సిలర్ జిలకర వాసు తెలిపారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జంగపల్లి శంకరమ్మ అనే మహిళ శుభకార్యం నిర్వహించడానికి తనకు చెందిన భూమిని అవసరానికి వాడుకుని, ఇప్పుడు ఆ భూమితనదేనని బుకాయిస్తోందని తెలిపారు. తన రాజకీయ ఎదుగుదలను చూసీ ఓర్వకుండా, తన భూమిని కాజేయాలనే తలంపుతో శంకరమ్మ లేనిపోని విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు. తన వల్ల ప్రాణహానీ ఉందని శంకరమ్మ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వాస్తవాలు బస్తీ ప్రజలకు తెలుసని ఆయన తెలిపారు.

చీడపీడల యాజమాన్యంపై అవగాహన పెంచుకోవాలి

కాసిపేట: అధిక సాంద్రత పత్తి సాగులో చేపట్టాల్సిన పోషక యాజమాన్యం, చీడపీడల యాజమాన్యంపై రైతులు అవగాహన పెంచుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి కల్పన తెలిపారు. గురువారం మండలంలోని సంద్రత్‌పహడ్‌లో జాతీయ పత్తి పరిశోధన సంస్థ నాగపూర్, కృషి విజ్ఞానకేంద్రం బెల్లంపల్లి ఆధ్వర్యంలో అధిక సాంద్రత పత్తిలో క్షేత్ర దినోత్సవం, రైతు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం బెల్లంపల్లి కోఆర్డినేటర్ కోట శివకృష్ణ, ప్రధాన శాస్త్రవేత్త సునిల్ మహజన్, శాస్త్రవేత్తలు తిరుపతి, నాగరాజు, బెల్లంపల్లి డివిజన్ ఏడీఏ రాజనరేందర్, మండల వ్యవసాయాధికారి ప్రభాకర్ పాల్గొన్నారు.

డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల నిరసన


అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తూ..

మంచిర్యాలఅర్బన్: జిల్లా ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యాజమాన్యాలు, అధ్యాపకులు గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమాలు చేపట్టి వినతిపత్రాలు అందజేశారు. ర్యాలీ నిర్వహించి ఐబీలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం జిల్లా ఐడీఓసీలోని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్‌కు, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. డిగ్రీ, పీజీ కళాశాలలకు సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేసేలా చూడాలని కోరారు.

ఉపాధికి ప్రణాళికలు

- 2025- 26 సంవత్సరానికి ఉపాధిహామీ పథకం పనులు గుర్తింపు
- గ్రామ పంచాయతీల్లో కొనసాగుతున్న సమావేశాలు
- వచ్చేనెల 20 వరకు గ్రామ సభలు పూర్తి..
- ప్రతీ కూలీకి వంద రోజుల పనిదినాలు కల్పించడమే లక్ష్యం

జిల్లాలో ఉపాధి కూలీల వివరాలు

మండలాలు	: 16
గ్రామ పంచాయతీలు	: 310
మొత్తం జాబ్‌కార్డులు	: 1,20,442
యాక్టీవ్ జాబ్‌కార్డులు	: 81,227
పనిచేసే కూలీలు	: 1,40,792


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

దండేపల్లి: జాతీయ ఉపాధిహామీ పథకంలో కూలీలకు పని కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. 2025–26 ఏడాదికి సంబంధించిన కార్యాచరణపై గ్రామాల్లో విస్తృతంగా సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. అక్టోబరు 2 నుంచి ఆయా పంచాయతీల్లో సమావేశాలు నిర్వహిస్తున్నారు. అధికారులు, కూలీలు, ప్రజలు, మాజీ ప్రజాప్రతినిధులు హాజరై చర్చిస్తున్నారు. మొత్తం 280రకాల పనులు చేపట్టడమే లక్ష్యంగా అంచనాలు రూపొందిస్తున్నారు. వచ్చే నెల 20వరకు గ్రామసభలు పూర్తి చేసి, ప్రణాళికలను మండల పరిషత్‌లకు, ఆ తర్వాత జిల్లాకు పంపించనున్నారు. వచ్చే ఏడాది మార్చి 31వరకు ఈ ఏడాదికి సంబంధించిన పనులు కొనసాగుతాయి. తర్వాత ఏప్రిల్ 1నుంచి కొత్తగా గుర్తించిన పనులు ప్రారంభిస్తారు.

సీజన్‌కు అనుగుణంగా...

ఉపాధి హామీ పనుల గుర్తింపునకు గ్రామ పంచాయతీల్లో నిర్వహించే సభల్లో సీజన్లకు అనుగుణంగా పనులు గుర్తిస్తున్నారు. వ్యవసాయ సీజన్ మెండుగా ఉన్న రోజుల్లో కూలీల హాజరు తక్కువగా ఉంటుంది. అందుకే వ్యవసాయ పనులు లేని సమయంలో అత్యధిక శాతం మందికి పనులు కల్పించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ సారి ముఖ్యంగా భూగర్భజలాల పెంపునకు అవసరమైన పనులకు ఎక్కువగా ప్రాధాన్యం ఇవ్వనున్నారు. చెరువులు, కాలువలు, కుంటల్లో పూడికతీత, కాలువల్లో పిచ్చిమొక్కలు, పొదలను శుభ్రం చేయడం, నీటి కుంటలు, రోడ్ల నిర్మాణం, వంటి పనులతో పాటుగా, వ్యక్తిగతంగా గొర్రెలు, మేకలషెడ్ల నిర్మాణాలకు కూడా ప్రాధాన్యం ఇచ్చేలా పనులు గుర్తిస్తున్నారు.

కూలీలందరికీ వంద రోజులు పని కల్పించేలా..

2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనుల గుర్తింపు కోసం ఈ నెల 2 నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నాం. వీటి ద్వారా ఎక్కువ మంది కూలీలకు పనులు కల్పించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. ప్రతి కూలీకి కనీసం వంద రోజులు పనికల్పిస్తాం.

– కిషన్, డీఆర్‌డీవో, మంచిర్యాల

బొగ్గుబాయి వార్తలు

ఎస్‌ఆర్పీ 3 గనిపై గేట్ మీటింగ్

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ నేతలు ఎమ్మెల్యేలతో పాటు మంత్రులు, డిప్యూటీ సీఎం, సీఎంల వద్దకు వెళ్లి మాట్లాడితే దాన్ని రాజకీయ జోక్యం అంటారా..? అని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు ఉపాధ్యక్షుడు జట్టి శంకర్‌రావు ప్రశ్నించారు. ఎస్‌ఆర్పీ 3 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో గురువారం ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిందని ఆ యూనియన్ నాయకులు ఆరోపించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో ఆ యూనియన్ జాతీయ సమితి సభ్యులు భీంరావు, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి తిరుపతి రాజు, కేంద్ర కమిటీ నాయకులు పాల్గొన్నారు.

కాసిపేట 2గనిపై కార్మికుల ధర్నా


నిరసన తెలుపుతున్న నాయకులు, కార్మికులు

కాసిపేట: కార్మికులు మూడు రోజులు గైర్హాజరైతే మళ్లీ విధులకు హాజరు కావాలంటే జనరల్ మేనేజర్ నుంచి అలోవ్ స్లిప్పు తీసుకురావాలని కాసిపేట 2గనిపై నోటీస్ బోర్డు వేయడంతో మందమర్రి ఏరియా కాసిపేట 2గనిపై గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులు ధర్నా చేసి నిరసన తెలిపారు. వెంటనే ఈ నిర్ణయాలను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్ డిమాండ్ చేశారు. అనంతరం కార్మికుల ఆందోళన వద్దకు వచ్చిన గని మేనేజర్ లక్ష్మీనారాయణ గైర్హాజరు శాతం తగ్గించేందుకు అలోవ్ స్లిప్ విధానం తెచ్చినట్లు తెలిపారు. యూనియన్‌లు, కార్మికుల కోరిక మేరకు విరమించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి గొల్ల శ్రీనివాస్, అసిస్టెంట్ సెక్రెటరీ బొద్దుల వెంకటేష్, నాయకులు పాల్గొన్నారు.

బీఎంఎస్ ఏరియా సెక్రెటరీగా రాజేందర్



శ్రీరాంపూర్: బీఎంఎస్ శ్రీరాంపూర్ ఏరియా సెక్రెటరీగా రాగం రాజేందర్‌ను నియమించారు. నస్పూర్ కాలనీలోని యూనియన్ కార్యాలయంలో గురువారం అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అధ్యక్షతన నూతన కమిటీ సభ్యులను నియమించారు. ఏరియా సెక్రెటరీతో పాటు ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా గొల్ల మహేందర్, శాంతం సంపత్‌లను నియమించారు.

ఓటు నమోదు చేసుకోవాలి

శ్రీరాంపూర్: రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 7, ఆర్కే న్యూటెక్ గనులపై గురువారం ఆయన యువ కార్మికులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులైన ప్రతి కార్మికుడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన అమూల్యమైన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సత్రం రమేష్, బింగి ప్రవీణ్, మహేందర్, చక్రి, మహేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎల్‌ఎం బృందం పర్యటన


ఈజీఎస్ పనులు పరిశీలిస్తున్న కేంద్ర కమిటీ సభ్యులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): నేషనల్ లెవెల్ మానిటర్స్(ఎన్‌ఎల్‌ఎం) బృందంలోని సభ్యులు గురువారం హాజీపూర్ మండలంలోని బుద్దిపల్లి, పెద్దంపేట గ్రామాలను సందర్శించారు. కేంద్ర కమిటీ సభ్యులు సీ.వీ.బాలమురళీ, కె.హెచ్.సునీల్ మండల, గ్రామ స్థాయి అధికారులతో కలిసి గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. పంచాయతీల రికార్డులను, నగదు పుస్తకాలను, పెన్షన్, జనాభా లెక్కల వివరాలను పరిశీలించిన అనంతరం పంచాయతీ ఆవరణలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు సాధిస్తున్న ఆర్థిక పురోగతి వివరాలు తెలుసుకున్నారు. నూతన జీపీ భవనం, నర్సరీ, ప్లాంటేషన్ తదితర పనుల పర్యవేక్షణతో పాటు పంచాయతీ, కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను, ఉపాధి హామీ పథకం పనులను, ప్రభుత్వ పథకాల అమలును క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. జీపీడీపీ ప్రణాళిక తయారీ విధానం గురించి తెలుసుకున్నారు. ఈ బృందం వెంట ఎంపీడీవో రత్నప్రసాద్, ఎంపీవో ఉమర్‌షరీఫ్, ఈజీఎస్ ఏపీడీ సదానందం, ఏపీవో మల్లయ్య, ఈసీ శ్రీనివాస్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం రాజన్న, పంచాయతీ కార్యదర్శులు రఘు, రూపాదేవి, టీఏలు స్రవంతి, వెంకట్, ఎఫ్ఏ మల్లేశ్‌లు ఉన్నారు.


జిల్లా కేంద్రంలో నివాళులర్పిస్తున్న వాకర్స్ సభ్యులు


జన్నారం: లోత్తొర్రెలో...

కుమురం భీంకు నివాళి

భీమారం/మంచిర్యాలటౌన్/జన్నారం/కోటపల్లి: ఆదివాసీ గిరిజనుల ఆరాధ్య దైవం కుమురం భీం వర్ధంతిని జిల్లా వ్యాప్తంగా గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలో రాముని చెరువు వాకర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, జన్నారం మండలం ఇందన్‌పల్లిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో, కోటపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో, భీమారం మండలం మాదన్నగూడెంలో వర్ధంతి నిర్వహించారు. జల్, జంగిల్, జమీన్ నినాదంతో ఆదివాసీలకు హక్కులను కల్పించిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు.


కోటపల్లి: నివాళులర్పిస్తున్న నాయకులు


భీమారంలో నివాళులర్పిస్తున్న ఆదివాసీలు

ఘనంగా వాల్మీకి జయంతి


శ్రీరాంపూర్: పాల్గొన్న చైర్ పర్సన్, కమిషనర్


శ్రీరాంపూర్: నివాళులర్పిస్తున్న జీఎం సంజీవరెడ్డి


దండేపల్లి: వాల్మీకి చిత్రపటం వద్ద నివాళి


రామకృష్ణాపూర్: నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్


నెన్నెలలో...

శ్రీరాంపూర్/దండేపల్లి/నెన్నెల/జైపూర్/రామకృష్ణాపూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రపంచానికి పవిత్రమైన రామాయణాన్ని కానుకగా ఇచ్చిన ఆదికవి మహర్షి వాల్మీకి అని అన్నారు. వాల్మీకి జీవితం అందరికీ ఆదర్శప్రాయం అని కొనియాడారు. నస్పూర్, మందమర్రి, క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయాల్లో, శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో, నెన్నెల, దండేపల్లి బోయ వాల్మీకి సంఘాల ఆధ్వర్యంలో, జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో, హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో వేడుకలు నిర్వహించారు. శ్రీరాంపూర్‌లో జీఎం సంజీవరెడ్డి, ఏరియా ఎస్‌ఓటుజీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచీ కార్యదర్శి ఎస్కె బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షులు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజెంట్ రాముడు, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, ఫారెస్టు అధికారి చంద్రమణి, సీనియర్ పీఓ కాంతారావు, నస్పూర్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ సుర్మిళ్ల వేణు, కమిషనర్ చిట్యాల సతీశ్, మున్సిపల్ ఏఈ మధు, క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, కమిషనర్ మురళీకృష్ణ, మేనేజర్ స్వామి, మందమర్రి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ డీఈ సుమతి, ఏఈ అచ్యుత్, ఇన్‌చార్జి మేనేజర్ కృష్ణ ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్, జైపూర్‌లో ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్‌రావు, జీఎం శ్రీనివాసులు, వోఅండ్‌ఎం జెన్‌సింగ్, సీఎంవోఏఐ ప్రెసిడెంట్ సముద్రాల శ్రీనివాస్, ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరీ సత్యనారాయణ, ఏజీఎం ప్రసాద్, మధన్‌మోహన్, అజ్మీర తుకారం, గుడిపేట పోలీస్ బెటాలియన్ కమాండెంట్ పి.వెంకటరాములు, బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్‌లు నాగేశ్వర్‌రావు, కాళిదాసు, ఆర్‌ఐలు, ఏఆర్ఎస్సైలు, బెటాలియన్ అధికారులు, ఆయా మున్సిపాలిటీల సిబ్బంది, బోయవాల్మీకి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మందమర్రిరూరల్: వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్లు


జైపూర్ పవర్ ప్లాంటులో వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు


మంచిర్యాలరూరల్(హాజీపూర్): గుడిపేట బెటాలియన్‌లో నివాళులర్పిస్తున్న పోలీసులు

- **మళ్లీ తెరపైకి నర్సరీ భూములు**

జైపూర్: మండల కేంద్రంలో గల 94సర్వే నంబర్‌లో నర్సరీకి దానం ఇచ్చిన ఎనిమిది ఎకరాల నర్సరీ భూమిని, గతంలో రెవెన్యూశాఖలో పని చేసిన అధికారులు వారి కుటుంబ సభ్యులపై పట్టా చేసుకొని ఆక్రమించడానికి ప్రయత్నం చేయగా అధికారులు దాన్ని అడ్డుకున్నారు. కొంతకాలంగా ఆ భూమి వివాదాస్పదంగా మారగా అందులో నర్సరీ కొనసాగుతుంది. మళ్లీ ఆ భూములను గతంలో పట్టా చేసుకున్న వ్యక్తులు రహస్యంగా వచ్చి నర్సరీకి బయట గేటుకు తాళం వేసి, లోపలి వైపున ట్రాక్టర్లతో చదును చేయగా స్థానికులు రెవెన్యూశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. అనంతరం నర్సరీ భూమిని కాపాడాలని స్థానికులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లుగా పేర్కొన్నారు.

- **రక్తదాన శిబిరాలు నిర్వహించాలి**

మంచిర్యాలటౌన్: ఈ నెల 21న పోలీసు అమరుల దినోత్సవం సందర్భంగా 10రోజుల పాటు నిర్వహించే ఫ్లాగ్ డే లో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పోలీసు అధికారులు తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తుల కోసం రక్తదాన శిబిరాలు నిర్వహించేలా చూడాలని తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసర్ల రంజిత్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

- **ప్రభుత్వ భూములు పరిరక్షించాలి**

రామకృష్ణాపూర్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ భూములను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ చైర్మన్ జంగం కళ మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలోని 19వార్డులో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలంలో ఓపెన్ జిమ్ కోసం ఎంపిక చేయగా, దాన్ని కొంతమంది వ్యక్తులు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లుగా ఆమె తెలిపారు. అధికారులు ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకొని మంజూరు కానున్న ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా చూడాలన్నారు.

సంక్షిప్త వార్తలు

- **ఆకస్మిక తనిఖీ**

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని పాత బస్టాండ్ సమీపంలో గల ఓ వైన్ షాపు దగ్గర ఉన్నటువంటి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో మున్సిపల్ అధికారులు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ అపరిశుభ్రంగా ఉండటంతో పాటు ఫ్రిడ్జ్‌లో చికెన్ దాచి ఉంచటంతో అధికారులు మండిపడ్డారు. అనంతరం ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వాహకుడికి రూ.2వేల జరిమానా విధించారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్, హెల్త్ అసిస్టెంట్ సమీర్, ఇన్‌చార్జి మేనేజర్ కృష్ణప్రసాద్, కార్యదర్శి, సిబ్బంది ఉన్నారు.

- **విద్యుత్ ఏడీఈగా బాలకృష్ణ**

చెన్నూర్: చెన్నూర్ విద్యుత్ ఆపరేషన్స్ సబ్ డివిజన్ ఏడీఈగా బాలకృష్ణ గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన బాలకృష్ణకు మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, విద్యుత్ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

- **మండలాలకు చేరిన చీరలు**

కాసిపేట/మంచిర్యాలరూరల్(హాజీపూర్): మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు మాత్రమే ఈ ఏడాది చీరలు పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు గురువారం హాజీపూర్, కాసిపేట మండలాలకు చీరలు వచ్చాయి. కాసిపేటలో కొన్ని గ్రామపంచాయతీల్లో పంపిణీకి సిద్ధపడగా పంపిణీ సమయంలో చీరల మూటలు విప్పడంతో ఒక్కసారిగా దుర్వాసన వచ్చిందని మహిళలు ఆరోపించారు. కేసీఆర్ ఇచ్చినప్పుడు మిగిలిన చీరలకు ప్రభుత్వం స్టిక్కర్లు మార్చి చేసి పంచుతున్నట్లు విమర్శించారు. ప్రస్తుతం ఉన్నతాధికారుల ఆదేశాలతో చీరల పంపిణీని నిలిపివేశారు.

- **నేడు ఆయుర్వేద వైద్య శిబిరం**

శ్రీరాంపూర్: నస్పూర్ కాలనీలోని మనోరంజన్ సముదాయంలో శుక్రవారం ఉదయం 10గంటలకు ఆయుర్వేద వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు శ్రీరాంపూర్ ఏరియా డీజీఎం(పర్సనల్) అరవిందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ వైద్యులు విశ్వనాథ మహర్షి హాజరై వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. బీపీ, షుగర్, నడుము నొప్పులు ఇతర దీర్ఘకాలిక జబ్బులతో బాధపడే కార్మిక కుటుంబాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

- **బాధ్యతల స్వీకరణ**

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ నూతన సీఐగా వేణుచందర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్సై సంతోశ్, పోలీసు సిబ్బంది స్వాగతం పలికారు.

- **కల్వర్టు నిర్మించొద్దని వినతి**

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని 15వ వార్డులోని ప్రజలు చికెన్ సెంటర్‌ల వద్ద నూతనంగా నిర్మిస్తున్న కల్వర్టును నిర్మించవద్దంటూ గురువారం మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌కు వినతి పత్రం అందించారు.

- **ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన**

దండేపల్లి: మండలంలోని నెల్కివెంకటాపూర్‌లో టీజీబీ ముత్యంపేట బ్రాంచి ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు.

- **శబరిమలకు పాదయాత్ర**

మంచిర్యాలటౌన్: పట్టణంలోని హైటెక్‌సిటీ కాలనీకి చెందిన సుంకి వంశీ అయ్యప్ప దీక్ష చేపట్టి శబరిమలకు గురువారం పాదయాత్రగా వెళ్లారు.

‘మార్కెట్‌కు మల్లేష్ పేరు పెట్టాలి’


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కామ్రేడ్స్

బెల్లంపల్లి: బెల్లంపల్లి కూరగాయల మార్కెట్‌కు సీపీఐ శాసనసభ పక్ష మాజీ నాయకుడు గుండా మల్లేష్ పేరు పెట్టాలని సీపీఐ శ్రేణులు డిమాండ్ చేశారు. ఆర్డీవో, మున్సిపల్, తహసీల్దార్ కార్యాలయాల్లో గురువారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ.. బెల్లంపల్లికి చెందిన గుండా మల్లేష్ ప్రజల ఆశీర్వాదంతో నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారన్నారు. ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేసి, పేదల పక్షపాతిగా పేరు గాంచారని పేర్కొన్నారు. మల్లేష్ చేసిన సేవలకు గుర్తుగా ఆయన పేరును కొత్తగా నిర్మించిన కూరగాయల మార్కెట్‌కు పెట్టి సముచిత స్థానం కల్పించాలని ప్రభుత్వ శాఖల అధికారులకు విన్నవించారు. సీపీఐ జిల్లా సీనియర్ నాయకుడు చిప్ప నర్సయ్య, రాష్ట్ర సమితి సభ్యురాలు బి.పూర్ణిమ, మహిళ సమాఖ్య రాష్ట్ర నాయకురాలు గుండా సరోజ, సీపీఐ పట్టణ కార్యదర్శి ఆడేపు రాజమౌళి, బెల్లంపల్లి మండల కార్యదర్శి బి.లక్ష్మీనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, నాయకులు పాల్గొన్నారు.

- **కార్యదర్శులతో సమీక్ష**

జైపూర్: మండలంలో గల 20గ్రామ పంచాయితీల కార్యదర్శులతో ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో బాపురావు అభివృద్ధి పనులు, నిధుల వివరాలపై గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.